

# అలసిపోయాను ప్రభూ...

ఇల్లంతా బోసిపోయినట్టుగా ఉంది. నేనూ నాన్న ఇద్దరం ఇంట్లోకి భారంగా అడుగుపెట్టే సరికే... అందరి మధ్యా నిశ్శబ్దం. ఇంట్లోంచి శవం తరలిపోయిందానికంటే కూడా... భయంకరమైన నిశ్శబ్దం. మమ్మల్ని చూడగానే, అందరి మనసుల్లోనూ ఎన్నెన్నో ప్రశ్నలు... కానీ అడగలేక, అడిగితే వచ్చే సమాధానాన్ని విని భరించలేక... మౌనం... మౌనం...

అమ్మ, అన్నయ్య, వదిన, పిల్లలు...

అందరి చూపులూ నావైపే...

ఏదో దిగులు... గుబులు...

నాన్న వాలుకుర్చీలో వాలిపోయారు. నేను నా గదిలోకి వెళ్లాను.

"కోర్టులో ఏమైంది?" అమ్మ నాన్ననడుగుతోంది.

"కేసు మనమే గెలిచాం... శారదకు విడాకులు మంజూరయ్యాయి"

నాన్న గొంతులో సుడులు...

నిజానికిది గెలుపా? ఓటమా?

కాసేపటికి అమ్మ ఏడుపు సన్నగా వినిపించటంతో గదిలోంచి బయటికొచ్చాను.

"కేసు గెలిచామమ్మా... కేసు గెలిస్తే ఆనందించాలిగాని... ఏడుస్తారా?" అమ్మని ఓదార్చలేని స్థితి. అన్నయ్య, వదిన చూపుల్లో నా పట్ల ఏదో భావం.

నాకు చదువుంది... ఉద్యోగముంది... అయినా నా భవిష్యత్తుని ప్రశ్నించే వీళ్ళ చూపుల్ని భరించలేకపోతున్నాను. ఇంటి ముందు ఆటో ఆగగానే... పాప స్కూల్ బ్యాగ్‌తో పరిగెత్తుకొచ్చింది. ఇంట్లో నిశ్శబ్దం దాన్ని కట్టిపడేసింది.

ఎంత దుర్భరమైన వాతావరణం...?

"అమ్మమ్మా... ఎందుకేడుస్తున్నావ్?"

నిన్నీ ప్రశ్నకి జవాబు దానికందనిది. కోర్టుబయట అడుగుపెట్టిన క్షణంనించే... జీవితం గురించిన ప్రశ్నలు వెంటాడుతున్నాయి.

ఆఫీస్‌కెళ్లాలా... వద్దా...? దార్లో నాన్నే చెప్పారు "వారం రోజుల వరకూ ఎక్కడికీ వెళ్లకు? అలాగనీ ఎక్కువగా ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దు. నీకు మేమంతా ఉన్నాం కదా"

అమ్మలు ప్రేమ పంచుతారేమోకాని... నాన్నలు సమస్యల్నీ, పరిస్థితుల్ని అర్థం చేసుకుంటారు. అమ్మతనంలోని గొప్పదనంకంటే కూడా ఇది ఎక్కువని ఇప్పుడిప్పుడు ఈ పరిస్థితుల్లో తెలుస్తోంది.

ప్రస్తుతం అందరిచూపులూ నిన్నీ వైపు తిరిగాయి అదేం తప్పు చేసింది? కోర్టు నిన్నీని శారదే ఉంచుకోవాలని కూడా తీర్పిచ్చింది.

ఎవరేమీ మాట్లాడకపోవడంతో నిన్నీ నా దగ్గరికి వచ్చింది. దగ్గరకు తీసుకొని తిరిగి గదిలోకి వెళ్లిపోయాను.

మావైపు వీళ్ళందరి జాలి చూపులు...

అతణ్ణించి విడిపోయి వచ్చి మూణ్ణెళ్ళయినా రాని జ్ఞాపకాలు... ఆ ఇల్లు, సంసారం, గొడవలు... ఈ రోజు విడాకులు మంజూరైనప్పట్నించీ తేనెటీగల్లా గుండె చుట్టూ ముసురుతూనే ఉన్నాయి.

ఏడవడానిక్కూడా ధైర్యం చాలట్లేదు...

నిన్నీని పొదివిపట్టుకుని పడుకున్నాను...

xxx xxx xxx

ఆఫీసెకెళ్లిన మొదటిరోజే...

కళ్లని పెకిలించుకొని నావైపు విసిరేస్తున్నట్టు చూపులు... వేటాడుతూ, వెంటాడుతూ... అయినా ఏమీ పట్టించుకోకుండా పనిమీద ధ్యాస మరల్చడానికి ఫైల్లో దూరాను. "మేడం... రాత్రి టీవిలో మావిడాకులు సిన్మా వచ్చింది. చూశారా? సూపర్నెంటుగాడి మాట... తూటాలా తగిలింది. మాట కలిపితే వాడు ఆ సిన్మాలోంచి వచ్చేసి తన జీవితం గురించి చర్చిస్తాడని తెలుసు.

"చూళ్లేదు" అసహనంగా అన్నాను.

"అరరే... మీరు చూడాల్సింది మేడమ్" అని నొచ్చుకున్నాడు. నేనేదో దేశద్రోహం తలపెట్టినంత బాధగా మూడ్ చెడిపోయింది.

నా కళ్లల్లో పాకిన ఎర్రజీర వాణ్ణి కలవరపెట్టి ఉంటుంది. సైలెంట్‌గా వెళ్ళిపోయాడు. లంచ్ అవర్లో సుమిత్ర, సౌజన్య, లక్ష్మి ఎవరూ తనని పిలవకుండానే డైనింగ్ హాల్లోకి వెళ్ళి భోంచేశారు. వాళ్లంతా నాకు కొంచెం దూరంగా ఉండటం బాధేసింది. రెండున్నరకి డైనింగ్‌హాల్లోకి వెళ్ళి ఒక్కదాన్ని టిఫిన్ బాక్స్ ఓపెన్ చేసినా తినాలన్పించలేదు. ఏవేవో జ్ఞాపకాలు...

వాటన్నింటికన్నా వీళ్లంతా తనని ఒంటరి చేయటం మరింత బాధపెడుతోంది. తనని తప్పుకొని తిరుగుతున్నారు. గొంతులోకి అన్నంముద్ద దిగలేదు. గంటసేపు అలాగే దీర్ఘాలోచనలో ఉండిపోయాను. స్వీపర్ రత్తమ్మ "ఏంటమ్మా.. ముఖంలో కళ తప్పింది. అన్నం ముందు కూసోని గంటైనా రెండు ముద్దలు తిన్లేదు. ఏమైందమ్మా?" అనడిగింది. అప్పటికి గాని ఈలోకంలోకి రాలేదు.

అందరూ తనవైపే చూస్తున్న ఫీలింగ్ ఎక్కువవుతోంది. రత్తమ్మకి ఏమీలేదని చెప్పి చేయికడుక్కున్నాను.

సెక్షన్ క్లర్కు నారాయణ కొంత చోరవతీసుకొని డైరెక్టుగా అడిగాడు. వాడి కళ్ళల్లో ఏదో జాలి.

"బైదిబై ఏమీ అనుకోవద్దు, మీరు విడాకులు తీసుకున్నారని తెలిసింది. ఆయన శాడిస్టా మేడం..."

"కాదు.. నేనే శాడిస్ట్‌ని"

నా మాటకి బిత్తరపోయాడు. అయినా తమాయించుకొని "లేదండీ.. మీరు చాలా మంచివారు. ఆఫీసులో చూడట్లేదా?" అన్నాడు.

"శాడిజం అనేది పదిమందిలో బయటపడదు. ఒంటరిగా ఉన్నప్పుడు దాని ప్రతాపం ఏంటో తెలుస్తుంది"

క్లర్కుకి నోటిమాట రాలేదు. బాస్ పిలుస్తున్నాడంటూ గబగబా వెళ్ళిపోయాడు. నాకు నవ్వు రాలేదు. కళ్లలో నీళ్లొచ్చాయి. తలనొప్పి ప్రారంభమవుతుంటే పర్మిషన్ తీసుకొని బయటపడ్డాను.

మూడున్నరకే ఇంటికొచ్చిన నన్ను అమ్మ విస్మయంగా చూసింది. వదిన మాటలెప్పుడో తగ్గించింది. నాన్నమాత్రం భుజం మీద చెయ్యేసి వరండాలో కుర్చీలో కూచోబెట్టి "ఏమైందిరా... అతిగా ఆలోచిస్తున్నావా?" అని లాలనగా అడిగారు. ఆ మాత్రం మాటకే గుండెకి గండిపడింది. కన్నీళ్ళు ఉప్పెనలా ఉబికివచ్చాయి. "స్టాఫ్‌లో కొందరు వ్యంగ్యంగా మాట్లాడటం భరించలేకపోతున్నా నాన్నా ..." అన్నాను.

దుఃఖాన్ని దిగమింగుకుంటూ. నాన్న నవ్వాడు.

"పిచ్చితల్లి... ఈ మాత్రం దానికే బెంగపడితే ఎలా? ముందు చాలా జీవితం ఉంది. లౌక్యంగా బతకడం నేర్చుకోవాలి. మన నోట్లో ముప్పయ్ రెండు కత్తుల్లాంటి పళ్లనడుమ నాలుక ఎలా బతుకుతోందో తెల్సా? మన నాలుకే మనకు నడవడిని చెప్తుంది..."

నాన్నలో నాకు అమితంగా నచ్చేగుణం అదే... ఎంత పెద్ద సమస్యవచ్చినా ఓ చిన్న ఉదాహరణ చెప్పి గొప్ప పరిష్కారం చూపిస్తారు.

"నాలుక మీదే నీకో జోక్ చెప్తాను విను..." అన్నారు.

నా మనసుని తేలికపర్చాలనే ప్రయత్నం నాన్నది.

"ఓసారి నోట్లోని పళ్ళు నాలుకని భయపెట్టాయట. మా సంఖ్య ముప్పయ్‌రెండు అని గుర్తుంచుకో. నువ్వొక్కదానివే. అందులోనూ మేమంతా కఠినంగా కత్తుల్లా నీకెప్పుడూ రెండువైపులా ఉంటాం. నువ్వో మాంసం ముద్దవి. మేం తల్చుకుంటే నిన్ను క్షణాల్లో ఖైమా చేస్తాం. జాగ్ర త్త అని హెచ్చరించాయి. అయినా నాలుక ఏమీ భయపడకుండా 'మీవల్లకాదు. మిమ్మల్ని రోజూ తప్పించుకొని లౌక్యంగా బతుకుతూనే ఉన్నా. నేను తల్చుకుంటే క్షణాల్లో మీ పనిపడతా' అందట. అది నీ తరం కాదు అని పళ్ళు వికటాట్టహాసం చేశాయి. నాలుక వెంటనే దారిన పోతున్న దానయ్యని బండబూతులు తిట్టడం మొదలెట్టింది. దాంతో వాడొచ్చి చెప్పుతీసి కొట్టగానే ముప్పయ్ రెండు పళ్లూ రాలి కింద పడ్డాయి... నాలుకలా బతకటం నేర్చుకో..."

నాన్న జోక్‌కి నవ్వాగలేదు. నవ్వాను... పడిపడీ నవ్వాను... చాలా రోజుల తరువాత గుండెల్నిండా నవ్వు. నాన్నకూడా శ్రుతి కలిపాడు.

అమ్మ సీరియస్‌గా వరండాలోకొచ్చింది.

"ఏంటానవ్వు... మొగుణ్ణించి విడాకులు తీసికొని మూణ్రోజులు కాలేదు... ఎలా నవ్వుతోందో చూడు అని వీధి వాళ్లంతా అనుకునేట్టు... దానికి సిగ్గులేకపోయినా మీకు బుద్ధిలేదూ..." అంది నాన్నవైపు ఉరిమి చూసి.

నవ్వులు క్షణాల్లో మాయమయ్యాయి. ఏదో నిస్సత్తువ ఆవరించింది. గోనెసంచిలో కట్టిపడేసినట్టు గుండె గిలగిలా కొట్టుకుంది.

మౌనంగా లేచి నా గదిలోకి నడిచాను.

నాన్న దీర్ఘాలోచనలో మునిగిపోయారు... ఏడవాలన్పించటం కూడా లేదు. రాత్రిళ్లు నిద్రలేక... పడుకోగానే మాగన్నుగా నిద్రపట్టింది....

లేచే సరికి ఇంట్లో పెద్ద గొడవ...

అన్నయ్య, వదిన ఏదో విషయం మీద పోట్లాడుకుంటున్నారు.

అది చిలికిచిలికి గాలివానవుతుంటే, నిలువెల్లా కంపించిపోయాను. తాను కూడా అరోజు అలాగే పోట్లాడింది. వాడు కొడితే తిరగబడి కొట్టింది. వీళ్ల గొడవకూడా అదే స్థాయికెళ్తోంది.

గదిలోనే వాళ్ల గొడవని వింటూ కూచున్నాను. వారి మధ్య సర్దిచేప్పే హక్కు నాకుందా? అన్నయ్య వదిన మీదో దెబ్బవేసినట్టున్నాడు. ఏడుస్తోంది. వదిన

ఫ్లవర్‌వాజ్ ఎసిరికొట్టిందేమో... భళ్ళున శబ్దం. ఇంట్లో అమ్మా నాన్నకూడా లేరు. గుడికెళ్లారు.

అన్నయ్యకంటే వదినే ఎక్కువ గొడవ చేస్తోంది. ఏడుస్తూనే అరుస్తోంది.

వీళ్లుకూడా విడిపోతారా...?

ఖచ్చితంగా విడిపోతారు !

గంటసేపు ఇద్దరి మధ్యా పెద్ద గొడవే జరిగింది. ఆరోజు మా మధ్య కూడా ఇంతే జరిగింది. స్కూల్ నించి నిన్నీ, గుడినించి అమ్మా నాన్నా వచ్చారు. అప్పటికే అంతా సద్దుమణిగింది. రేపు వదిన పుట్టింటికీ అన్నయ్య కోర్టుకి వెళ్లటం ఖాయం అనుకున్నాను.

కానీ మర్నాడు అంతా మామూలుగానే జరిగిపోయింది. కాకపోతే వాళ్లిద్దరి మధ్య మాటలు కరువయ్యాయి.

రెండ్రోజులు అంతే!

మూడోరోజు వదిన టిఫిన్‌బాక్స్ సర్ది నిన్ని చేత అన్నయ్యకిప్పించింది.

సాయంత్రం అన్నయ్య మల్లెపూలు తెచ్చి టేబిల్‌మీద పెట్టాడు. వదిన హుషారుగా తయారై జడలో పెట్టుకుంటుంటే, ఆపుకోలేక అన్నాను.

"మీ గొడవ వింటే భయమేసింది వదినా..."

వదిన నవ్వి "పంతాలు పట్టింపులనేవి సంసారంలో క్షణికంగానే ఉండాలి తప్ప... శాశ్వతం కాకూడదు. వైవాహిక బంధాన్ని కలిపేది కేవలం

మూడుముళ్ళమ్మా... వాటిని తెంపేసుకోవటం చాలా సులువు. కానీ సంసారాన్ని నడిపేది మాత్రం సర్దుబాటు. అది మూడు ముళ్ళకన్నా గొప్పది. అది లేకపోతే ఈ పాటికి ఇంటికిద్దరైనా నీలాంటి వాళ్ళుండేవారు..." అంది.

ఆ మాట నా మనసుని చివ్వున తాకింది.

"అభ్యుదయాలు, ఇజాలు నాకు తెలీవమ్మా... ఒక్కోసారి ఏ పండగకో, ఫంక్షన్‌కో చాలా గొప్పగా ఆనందాన్ని పంచుకుంటాం. కళ్లల్లో వెలుగులే కాదు. కన్నీళ్లూ ఉంటాయి. కన్నీళ్లొస్తున్నాయని కన్నుని పొడుచుకోంగదా..." అయినా ఈ కాలంలో మాత్రం ఎవరికి ఎవరూ కారు... ఒక్క భార్యకి భర్త... భర్తకి భార్య మాత్రమే మిగులుతారనేది నిజం. కనీసం మిగలాలి కూడా! ఎందుకంటే ఉమ్మడి కుటుంబాల నించీ వ్యష్టి కుటుంబాలకొచ్చాం. వ్యష్టి కుంటుంబాల నుంచి ఇంకెక్కడికెళ్తాం...? అందుకే సంసారంలో గొడవలు అద్దం మీద పడ్డ ఆవగింజల్లా జారిపోవాలి తప్ప... అద్దాన్ని పగులగొట్టకూడదు" అనేసి మల్లెలు తురుముకొని వెళ్లిపోయింది.

నేను ఒంటరిదాన్ననే భావనే రోజురోజుకీ పెరుగుతోంది.

అప్పుడప్పుడు నిన్నీ వేసే ప్రశ్నలు చిక్కుముడుల్లా కన్పిస్తున్నాయి. గొడవ - కోర్టు - జడ్జిమెంటు మాటిమాటికీ గుర్తొస్తున్నాయి.

చిత్రమైన నరకం...

అప్పటికే ఏడాది గడిచింది...

అనుకోకుండా తెల్సిన వార్త... అతను రెండురోజుల క్రితమే పెళ్లి

చేసుకున్నాడని !

మనసు మూగబోయింది....

ఎందుకు...??

ఏమో... ??

అతని మీద మరింత కోపం పెరిగింది ? అయినా తనకేం హక్కుంది?

ఆ శుభలేఖ చూడాలన్పించింది....

ఆవిడను కూడా ఓసారి చూస్తే....?

ఛ... వాడి గురించి ఇంకా ఆలోచించడమేంటి? తను ఒక వ్యక్తిత్వం గల ఆడది. సర్దుబాటు సూత్రాలతో రాజీపడి సంసారం చేయటం తన వల్లకాదు. మరి ఈ ఆలోచనలన్నీ ఎందుకొస్తున్నాయ్...??

రానీయొద్దు... గుండెని బండగా మార్చుకొని బతకాలి.

ఎల్లుండి మ్యారేజ్ డే...

ఆరోజంతా పెళ్లి క్యాసెట్టేసుకొని పెళ్లి కొచ్చిన బంధువుల మీద జోక్సువేసుకుంటూ... మీ పెళ్లికి నన్నెందుకు తీస్కెళ్లలేదంటూ ఏడ్చే విన్నీని ఆటపట్టిస్తూ... రాత్రి హోటల్‌లో భోంచేసి...

ఛ... అవన్నీ మర్చిపోవాలి.

ఆరోజు ఎక్కడైనా గుడిలో గడిపిరావాలి.

తిరుపతికెళ్తే...

వద్దు... వద్దు... పెళ్లయ్యాక మొదటిసారి వెళ్లింది తిరుపతికే... అక్కడా జ్ఞాపకాలు వెంటాడుతాయి.

ఎక్కడికి వద్దు... ఇలా ఇంట్లోనే గడపాలి.

ఆరోజు రానేవచ్చింది. ఇంట్లో అందరిచూపుల్లోనూ వెలివేసిన భావన.

అందరి మాటల్లోనూ రోజురోజుకి పెరుగుతున్న చులకన భావం...

ఈ మాటలు.. ఈ చూపులు... నేనింక తట్టుకోలేను. పారిపోవాలి... పారిపోవాలి...

కాస్త రిలీఫ్‌గా ఉంటుందని గుడికెళ్తోంటే, చిత్రంగా... అతి విచిత్రంగా... అతను ఎదురుపడ్డాడు.

గుండె చెదిరిపోయింది. అడుగులు తడబడ్డాయి.

ఎంత వద్దనుకున్నా నా బెదురు చూపులు అతణ్ణే నిలువెల్లా తడుముతున్నాయి. బాగా చిక్కిపోయాడు.

పెరిగిన గడ్డం... మాసిన గుడ్డలు.. పగిలిన పెదాల మధ్య మండుతోన్న సిగరెట్టు.. జీవం కోల్పోతున్న కళ్ళు...

నన్ను చూడగానే అతని కళ్లలో తడి...

ఆ తడి చూసి నా గుండె చెమ్మగిల్లిందేమో.. పెల్లుబికిన గోదారైంది.

సిగరెట్ పడేసి "శారూ..." అని పిలిచాడు.

ఆ పిలుపులో ఆర్ద్రత... ఆవేదన...

"బావున్నావా" అతనే అడిగాడు.

"ఊఁ" అనే శబ్దం గొంతు దాటడానికి ఎన్ని సుడులు తిరిగిందో నాకే తెల్సు.

అతను వెనక్కి తిరిగి నడిచాడు. నేనూ అతన్నే అనుసరించాను.

ఓ చెట్టుకింద... అతను కన్నీళ్లు కార్చాడు.

నీవు లేని లోటు ఏంటో తెల్సిందన్నాడు. మళ్లీ చేసుకున్నావిడ గయ్యాళితనాన్ని ఎడమర్చి చెప్పాడు. ఆమె ఉద్యోగం లేని గృహిణి కావటంతో అప్పులు పెరిగిపోయాయని దుఃఖించాడు. క్షమించమన్నాడు.. పాదాల్ని సైతం పట్టుకుంటానన్నాడు. మళ్లీ నన్ను చేరదీస్తానన్నాడు. నిన్ని రోజూ గుర్తొస్తోందన్నాడు.

అతని మాటలకి వైనంలా కరిగిపోయాను... కన్నీటి మూటనై కదిలిపోయాను. రెండు గంటలు మనసు విప్పి మాట్లాడుకున్నాం. విడిపోయిన ఈ రెండేళ్ళలో తన జీతం లక్షా నలభై ఎనిమిది వేల రూపాయల లెక్కడిగాడు.

కొంత అప్పుగానైనా ఇమ్మని కోరాడు.

నేనే తనదాన్నవుతున్నపుడు... ఆ డబ్బు నాకెందుకు??

ఆనందంగా ఇంటికొచ్చాను. వీళ్ల చూపుల్ని, వీళ్ల మాటల్ని నిలువునా తగిలెయ్యాలన్పించింది. ఆరోజు ఎవరికీ ఏమీ చెప్పలేదు.

రాత్రంత ఆలోచించి... మర్నాడు అందర్నీ సమావేశపర్చి నా అభిప్రాయాన్ని చెప్పాను.

"నేను తిరిగి అతని దగ్గరికే వెళ్తున్నాను" అంతా అవాక్కవుతారని తెల్సు.

"చంపేస్తాను..."

తలుపు దగ్గర ఆడగొంతు అరుపు విని... నేనే అవాక్కయ్యాను.

అపరిచిత వ్యక్తి... రివ్వున దూసుకొచ్చింది.

"నా కాపురంలోకి అడుగు పెట్టావో... నిలువునా పాతేస్తాను. వాడో దగుల్బాజీ. వాణ్ణించి విడిపోయి మళ్లీ వస్తావా? రెండో భార్యగానా ? మళ్లీ మొదటి భార్యగానా? ఏ పేరు పెట్టాలి నీకు? వాడి కాళ్లు పట్టుకొని మళ్లీ ఏలుకొమ్మని భోరున ఏడ్చావట? వాడు జాలిపడుతున్నాడు. కానీ మా సంసారంలోకి నువ్వు తిరిగొస్తే నేను నీలాంటిదాన్నికాదు. వాణ్ణీ, నిన్నూ ఉప్పు పాతరేస్తాను. ఖబడ్దార్..." అని పిడుగులా హెచ్చరించింది.

నిమిషంలో తుపానొచ్చిపోయినట్టు...

నేను ఖంగుతిన్నాను. ఇంట్లో వాళ్లు బిత్తరపోయారు. నాకైతే మరోసారి తలతీసేసినట్లయింది. పంతాలతో చేజారిన జీవితం... ఎప్పటికీ నేలమీది పాదరసమే అన్పించింది. నాన్న ఆర్తిగా నా భుజం తట్టి...

"ఇందులో నీ తప్పేమి లేదమ్మా... నువ్వతనికి మళ్లీ చేరువవ్వాలనుకొన్నది అతని కోసం తపించికాదు... నీ చుట్టూ ఉన్నవాళ్ళనించి పారిపోవాలని! నీకిక్కడ ఆత్మీయత అనేది లభిస్తే ఆ ఆలోచనే వచ్చేదికాదు..." అన్నారు. ఆ స్థితిలో దేవుడే రక్షించాడేమో... 'పోస్ట్' అన్న కేక విని ఏమిటో అనుకున్నాను.

'ట్రాన్స్ఫర్ ఆర్డర్స్'

నాల్రోజులుగా ఆఫీస్‌కెళ్ళలేదు. అందుకే పోస్ట్‌లో పంపి ఉంటారు.

మర్నాడే రిలీవ్ అయి నిన్నీని తీసుకొని కరీంనగర్ వచ్చేశాను.

XXX XXX XXX

పద్నాలుగేళ్ల తర్వాత ...

నిన్నీకి లా ఎంట్రన్స్‌లో ర్యాంక్ వచ్చిన్రోజు ఆనందంగా నన్ను చుట్టేసింది. అయినా కన్నీళ్లతో నేను చెప్పిందొకటే...

"నువ్వు అడ్వకేటు కావాలనే ఎందుకు చదివిస్తున్నానో తెల్సా నిన్నీ... రాజ్యాంగంలో ఉన్న విడాకుల చట్టం ఏ సంసారాన్నీ చుట్టుముట్టకుండా చూడు. క్షణికావేశంలో కోర్టుకెక్కితే ఈ రోజు సగం మంది సంసారాలు కోర్టుబోనుల్లోనే చెదిరిపోయేవి. 'సర్దుబాటు చట్టం' అనే కొత్త చట్టాన్ని నువ్వు రాయాలి. విడిపోదామని నీ దగ్గరికొచ్చిన ఏ జంటకైనా అది ప్రాణం పోయాలి. వాళ్ల పిల్లల భవితవ్యానికి బాటలు వేయాలి..." అన్నాను ఆర్తిగా దగ్గరకు తీస్కుంటూ.

నిన్నీ "తప్పకుండానమ్మా..." అని నా భుజాలు పట్టి కుదిపింది. ఆ తరువాత విచార వదనంతో చెప్పింది.

"అమ్మా... నాన్న చనిపోయాట్ట..."

ఏ జ్ఞాపకాల్నయితే పదిహేడేళ్లుగా అణిచిపెడుతున్నానో అవి శకలాలై రాలిపోయాయి. ఎందుకో... నిన్నీని కౌగలించుకొని బావురుమన్నాను.

'అలసిపోయాను ప్రభూ...'

ఎక్కణ్ణించో మీరాబాయి గీతం... గతాన్ని తొలుస్తూ... Ⓛ